క్లుప్తంగా

బ్యాంక్ ఖాతాల్లోనే పింఛన్ల జమ

విజయవాడరూరల్: జూన్ నెలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసే సామాజిక భద్రత పింఛన్లు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమచేయడం జరుగుతుందని విజయవాడ రూరల్ ఎంపీడీఓ ఎ.శ్రీరమ్య గురువారం తెలిపారు. దివ్యాంగులు, దీర్ఘకాల వ్యాధులతో మంచంపై ఉంటున్న లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్ద పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మండలంలో 4,018 మందికి మాత్రమే ఇంటి వద్ద పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందని, మిగిలిన 13వేల మంది బ్యాంకులకు వెళ్లి డ్రా చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి సెక్షన్ మహాలక్ష్మినగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 7.30 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజేఆర్‌నగర్, నిడమానూరు రోడ్డు, మహాలక్ష్మినగర్, వసంతనగర్, విష్ణుపురంకాలనీ, సాయినగర్, బందరు రోడ్డు, ఆర్టీసీ కాలనీ, లక్ష్మీపురంకాలనీ, బ్రహ్మంగారి గుడి, రంగా బొమ్మ సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

తాడిగడపలో ఆలయ కౌలు భూముల వేలంపాట వాయిదా

పెనమలూరు: తాడిగడప గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానానికి చెందిన వ్యవసాయ సాగు భూమి కౌలు వేలం వాయిదా పడిందని ఆలయ కార్యనిర్వహణాధికారి పి.మోహన్‌రావు తెలిపారు. గురువారం ఆయన వివరాలు తెలుపుతూ గ్రామంలో ఆర్ ఎస్ నెంబర్ 133లో 8.72 ఎకరాల వ్యవసాయ సాగు భూమికి గురువారం ఆలయ ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు కౌలు బహిరంగ వేలం పాట నిర్వహించామన్నారు. అయితే కౌలు పాటకు ఎవ్వరు రానందున వాయిదా వేశామన్నారు. తిరిగి కౌలు పాట తేదీని ప్రకటిస్తామని ఈఓ తెలిపారు.

ఏపీ ఈసెట్‌లో కానూరు విద్యార్థికి 8వ ర్యాంక్



పెనమలూరు: ఏపీ ఈసెట్ ప్రవేశ పరీక్షలో కానూరు విద్యార్థి రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాడు. రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రకటించిన ఈసెట్ ప్రవేశ పరీక్షల ఫలితాల్లో కానూరుకు చెందిన బన్నారావూరి ఈశ్వర్‌సాయిరాజా రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంకు సాధించాడు. ఈశ్వర్‌సాయిరాజా గుడ్లవల్లేరులో పాలిటెక్నిక్‌లో సివిల్ ఇంజినీరింగ్ చేసి కాలేజీ టాపర్‌గా నిలిచాడు. బీటెక్ సివిల్‌లో చేరాలనే ఉద్దేశంతో ఏపీ ఈసెట్ ప్రవేశ పరీక్ష రాసి సత్తా చాటాడు. ఈశ్వర్ తండ్రి శ్రీనివాసరావు సివిల్ ఇంజినీర్. తల్లి శ్రీదేవి గృహిణి. తాను బీటెక్‌లో సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి నిర్మాణ రంగంలో వస్తున్న నూతన టెక్నాలజీపై దృష్టి పెడతానని పేర్కొన్నారు.

సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులో సురక్షిత తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని గ్రామ సర్పంచి రాచమళ్ల పూర్ణచంద్రరావు తెలిపారు. గ్రామంలోని వాటర్ ట్యాంకులను గురువారం సర్పంచి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ ఈ వేసవిలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు వివరించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులతో పాటు మోటారు బోర్ల సాయంతో తాగునీటిని అందిస్తున్నట్లు తెలిపారు. జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ. 3 కోట్లతో 4 నూతన వాటర్ ట్యాంకులను నిర్మిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే 2 ట్యాంకుల నిర్మాణం పూర్తి అయ్యాయని, మరో రెండు ట్యాంకులు టెండర్ దశలో ఉన్నట్లు తెలిపారు.

విద్యార్థుల ఫీజు కాజేసిన వ్యక్తిపై కేసు

పెనమలూరు: పోరంకి గ్రామంలో ఉన్న గోసాలైట్స్ కాలేజీలో పని చేసిన వ్యక్తి విద్యార్థుల ఫీజు సొమ్ము కాజేసిన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం కాలేజీ ప్రిన్సిపాల్ బండారుపల్లి అబినేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోరంకి గోసాలైట్స్‌లో నీట్‌కోచింగ్ ఇస్తారు. అదే కాలేజీలో చాట్రాయి మండలం సూరెంపాలెంకు చెందిన దార్ల ఆదివిష్ణు కోఆర్డినేటర్‌గా పని చేస్తున్నాడు. అయితే ఆదివిష్ణు విధులు సక్రమంగా నిర్వహించడం లేదని యాజమాన్యం అతనిని ఉద్యోగం నుంచి తొలగించింది. కాగా అకౌంట్స్ పరిశీలించగా ఆదివిష్ణు విద్యార్థుల వద్ద నుంచి రూ. 8.50 లక్షలు అక్రమంగా వసూళ్లు చేసి సొమ్ము తన ఖాతాలో వేసుకున్నాడని తేలింది. కాలేజీ యాజమాన్యం ఆదివిష్ణును నిలదీయగా రూ. 4 లక్షలు తిరిగి చెల్లించాడు. మరో రూ. 4.35 లక్షలకు పైగా సొమ్ము చెల్లించలేదు. దీంతో కాలేజీ ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఆదివిష్ణుపై కేసు నమోదు చేశారు.

శ్మశానవాటికకు కొత్తరూపు

- కోటి రూపాయలతో నిర్మాణ పనులు
- కర్మకాండలు చేయడానికి ప్రత్యేక భవనం
- రంగురంగుల పూలమొక్కలతో గ్రీనరీ



పెనమలూరులో నూతనంగా నిర్మించిన శ్మశానవాటిక భవనం

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. గ్రామ జనాభా 20 వేలు దాటినా గ్రామంలో శ్మశానవాటికకు వసతులు లేకపోవడంతో గ్రామస్తులు చాలా సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఎవరైనా మృతి చెందితే దహన సంస్కారాలు చేయడానికి శ్మశానవాటికలో సదుపాయాలు లేక ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో గ్రామస్తులు శ్మశానవాటిక అన్ని హంగులతో నిర్మాణం చేయాలని సమిష్టిగా నిర్ణయించుకున్నారు. దీంతో గ్రామంలో శ్మశానవాటికకు ఉన్న 33 సెంట్ల స్థలంలో నూతన భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

ప్రభుత్వ గ్రాంటు రూ. 5 లక్షలు..

గ్రామంలో నూతనంగా శ్మశానవాటిక నిర్మాణం చేయడానికి రూ. కోటి ఖర్చు అవుతుందని శ్మశానవాటిక అభివృద్ధి కమిటీ అంచనా వేసింది. దీంతో గ్రామస్తులు, దాతలు ముందుకు వచ్చారు. అధ్వానంగా ఉన్న శ్మశానవాటిక స్థలాన్ని మెరక చేశారు. చుట్టూ ప్రహరీ నిర్మాణం చేశారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 లక్షలు గ్రాంటు కూడా ఇచ్చింది. దహన సంస్కారాలు చేయడానికి రూ. 6 లక్షలతో చిమ్నీతో ఉన్న నాలుగు ప్లాట్‌ఫారాలు నిర్మాణం చేశారు. దహన సంస్కరాల అనంతరం స్నానాలు చేయడానికి ప్రత్యేక షవర్లు, బాత్ రూమ్‌ల నిర్మాణం చేశారు. శ్మశానవాటికలో రంగు రంగుల పూలమొక్కలతో గ్రీనరీ ఏర్పాటు చేశారు.



కర్మకాండల భవనం

అన్ని కార్యక్రమాలకు వసతులు..

శ్మశానవాటికలో అన్ని కార్యక్రమాలు చేసుకోవడానికి వసతులు సమకూర్చారు. దహన సంస్కారాల తర్వాత కర్మకాండలు చేయడానికి ప్రత్యేక భవనం నిర్మించారు. మహిళలు ఎవరైనా దహన సంస్కారాల్లో పాల్గొంటే వారికి ప్రత్యేక వసతులతో రూమ్‌లు, బాత్ రూమ్‌లు నిర్మించారు. చిన్న కుటుంబాల వారు ఖర్చు తగ్గించుకోవడానికి దినం భోజనాలు పెట్టుకోవడానికి ప్రత్యేక హాల్ నిర్మాణం చేస్తున్నారు. శ్మశానవాటిక ప్రాంగణంలో మహాశివుడు, సత్యహరిశ్చంద్రుడి విగ్రహాలు పెట్టారు. భవిష్యత్తులో శ్మశానవాటికకు మృతదేహం తీసుకురావడానికి వాహనం, మృతదేహాలు ఉంచడానికి ఫ్రీజర్లు, అలాగే దాతల సాయంతో రూ. 14 లక్షలతో గ్యాస్‌తో దహన సంస్కారాలు చేయడానికి ప్రతిపాదనలు చేశారు. మరికొద్ది రోజుల్లో పెనమలూరు శ్మశానవాటిక అన్ని వసతులతో గ్రామస్తులకు అందుబాటులోకి రానుంది.

అందరి సహకారంతో నిర్మాణం



ఇప్పటికే అన్ని వసతులతో శ్మశాన వాటిక నిర్మాణం చేపట్టాం. దాతలు ముందుకు వచ్చి మరింత సాయం అందిస్తే అనుకున్న విధంగా శ్మశానవాటిక నిర్మాణం పూర్తి చేస్తాం. గ్రామంలో శ్మశానవాటిక అభివృద్ధికి అందరి పాత్ర, సహకారం ఉంది.

–కోయా శ్రీహరి, శ్మశానవాటిక అభివృద్ధి కమిటీ సభ్యుడు

దాతల సాయం మరువలేనిది



గ్రామంలో శ్మశానవాటిక అభివృద్ధికి దాతలు అందించిన సాయం మరువలేనిది. శ్మశానవాటిక నిర్మాణం చివరిదశలో ఉంది. అన్ని వసతులతో నిర్మాణం పూర్తి చేయడానికి దాతలు మరింత సాయం చేయాలి. ప్రభుత్వ పరంగా నిధులు మంజూరుకు కృషి చేస్తాను.

–లింగాల భాస్కరరావు, పెనమలూరు గ్రామ సర్పంచి



దహన సంస్కారాల ప్లాట్‌ఫారాలు



శివుడు, సత్యహరిశ్చంద్రుడి విగ్రహాలు



శ్మశానవాటికలో గ్రీనరీ

ఓట్ల లెక్కింపులో కట్టుదిట్టమైన చర్యలు

ఎస్పీ రజిని



పెనమలూరులో పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ రజిని

పెనమలూరు: ఓట్ల లెక్కింపు సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండటానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పెనమలూరు నియోజకవర్గానికి ప్రత్యేకంగా నియమించిన ఎస్పీ రజిని పోలీసులను ఆదేశించారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో నియోజకవర్గ పరిధిలో ఉన్న పోలీసు అధికారులతో గురువారం ఆమె ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్పీ రజిని మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని విధిగా ప్రతి ఒక్కరూ పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే 144 సెక్షన్, పోలీసు యాక్టు 30 కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించే ఎంతటివారినైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు విస్తృతంగా పర్యటించాలని, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని, రాజకీయ నాయకులు, సోషల్‌మీడియా నిర్వాహకుల కదలికలు గమనించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఎస్పీ సుభాష్, సీఐలు టీవీవీ. రామారావు, వాసంశెట్టి శ్రీనివాసరావు, హబీబ్‌బాషా, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు కార్యక్రమం



ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల గుర్తింపు కార్యక్రమంలో ఐఈఆర్టీ టీచర్స్

గన్నవరం: సమగ్రశిక్ష ఆధ్వర్యాన మండలంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల గుర్తింపు కార్యక్రమం కొనసాగుతోంది. భవిత కేంద్రం ఐఈఆర్టీ టీచర్స్ పి.శ్రీనివాసరావు, ఎస్.రోజారాణి బృందం గురువారం కేసరపల్లి, గన్నవరం గ్రామాల్లో పర్యటించారు. ఐదేళ్లలోపు చిన్నారులు, ఆరు నుంచి 18 ఏళ్లలోపు ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికలను గుర్తించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ... ఈ నెల ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకు బడి బయట ఉన్న ఆరుగురు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. వీరిలో అవసరమైన వారిని భవిత కేంద్రంలో, మిగిలిన వారిని తగిన పాఠశాల, కళాశాలల్లో చేర్చడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా భవిత కేంద్రంలో స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, బీహేవియర్ మోడిఫికేషన్, ఎర్లీ ఇంట్రాన్షన్ పద్ధతుల ద్వారా పిల్లల్లో వైకల్యం పెరగకుండా నియంత్రిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా పిల్లలకు పలు అలవెన్స్‌లు, అవసరమైన వారికి వినికిడి యంత్రాలు, రోలేటర్స్, వీల్‌చైర్స్ అందిస్తున్నట్లు వివరించారు. బడి బయట ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు ఉంటే 9848464352, 8142517787 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ధనేకుల కాలేజీలో ప్రాంగణ ఎంపికల వేడుకలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ బోర్డు ఆదేశాల మేరకు 2023–24వ సంవత్సరంలో ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించిన డిప్లొమా విద్యార్థులకు గురువారం విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి మాట్లాడుతూ తమ విద్యార్థులు బహుళ జాతి కంపెనీల్లో 25 మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ టి.రాజు మాట్లాడుతూ డిప్లొమా చదివే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. డైరెక్టర్ రవిప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి వినూత్న ఆలోచనలతో నాణ్యమైన బోధన చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాలేజీ చైర్మన్ ధనేకుల రవీంద్రనాథ్‌ఠాగూర్, కార్యదర్శి భవానీప్రసాద్, కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోరంకిలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



పెనమలూరు: కార్మికుల హక్కుల కోసం సీఐటీయూ నిరంతర పోరాటం చేస్తుందని మండల సీఐటీయూ కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి అన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం పోరంకిలో సీఐటీయూ జెండా ఆవిష్కరించి ప్రసంగించారు. సీఐటీయూ ఏర్పడిన నాటి నుంచి నేటివరకు దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు చేసి కార్మికుల హక్కులు కాపాడిందన్నారు. కార్మికుల సమస్యలపై పోరాటం చేయడానికి అన్ని సంఘాలు, కార్మికులు ఐక్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో నేతలు సీహెచ్.సుధాకర్, నజీర్, వి.సురేష్, మస్తాన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ



ఉంగుటూరులో వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ హరీష్‌కుమార్

ఉంగుటూరు: రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీపై వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయశాఖ అధికారి హరీష్‌కుమార్ తెలిపారు. ఉంగుటూరు ఆర్బీకే వద్ద పలువురు రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30కిలోల బస్తా పూర్తి ధర రూ. 1,194 కాగా ప్రభుత్వం కిలో విత్తనాలు రూ. 5 సబ్సిడీపై రైతు 30కిలోల బస్తాకు రూ. 1,044కు చెల్లించాలని చెప్పారు. ఉంగుటూరు, ఆత్కూరు ఆర్బీకేల్లో ఎంటీయూ 1318 రకం 120 క్వింటాళ్లు, ఎంటీయూ 1061రకం 60 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మిగిలిన ఆర్బీకేల్లో కూడా 230 క్వింటాళ్ల విత్తనాలు సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు తమ పొలం పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్ కాపీలతో ఆర్బీకేల్లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు రైతులు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

అత్తింటివారిపై వరకట్న వేధింపుల కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటి వారిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు సనత్‌నగర్‌కు చెందిన షేక్.ముస్కాన్‌కు 2023 సంవత్సరంలో గుంటూరుకు చెందిన షేక్.మహ్మద్ రఫీతో వివాహం అయింది. పెళ్లి సందర్భంగా కట్నకానుకలు ఇచ్చారు. భర్త ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో రికవరీ ఉద్యోగిగా పని చేస్తాడు. కాగా పెళ్లి జరిగిన కొద్ది నెలలకే భర్త మద్యం సేవించి వచ్చి అదనపుకట్నం తీసుకురమ్మని వేధించసాగాడు. భర్తతో పాటు అత్త గౌసియా, ఆడపడుచు తస్లీయా వేధించడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు అత్తింటివారిపై కేసు నమోదు చేశారు.

విద్యార్థులు ఆసక్తి గల రంగాల్లో రాణించాలి



తెన్నేరు గ్రంథాలయంలో నృత్య శిక్షణ పొందుతున్న విద్యార్థులు



వణుకూరు గ్రంథాలయంలో విద్యార్థులు



పురుషోత్తపట్నంలో డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కంకిపాడు: ఆసక్తి గల రంగాల్లో విద్యార్థులు ప్రావీణ్యం సాధించాలని తెన్నేరు గ్రంథాలయాధికారి ఎస్.సునీత అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో తెన్నేరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. గురువారం విద్యార్థులకు నృత్యంలో శిక్షణ, ఆటల పోటీలు నిర్వహించారు. చెస్, క్యారమ్స్‌లో పట్టు సాధించేందుకు అవసరమైన మెళుకువలు నేర్పించారు. శిక్షణా కార్యక్రమాలను గ్రంథాలయాధికారి సునీత పర్యవేక్షించారు.

పెనమలూరు: వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా వణుకూరు శాఖా గ్రంథాలయంలో గురువారం పలు కార్యక్రమాలు నిర్వహించామని గ్రంథాలయ అధికారిణి భారతి తెలిపారు. విద్యార్థులకు పుస్తక పఠనం, ఆటపాటల పోటీలు నిర్వహించామని చెప్పారు. విద్యార్థులకు పలు కార్యక్రమాలు నిర్వహించి వారిలో ఆలోచనా శక్తిని పెంపొందిస్తున్నామని ఆమె వివరించారు.

గన్నవరం రూరల్: విద్యార్థుల సృజన వెల్లడికి సమ్మర్ క్యాంపులు దోహదం చేస్తాయని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయ లైబ్రేరియన్ కె.కృపానందం అన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆలోచనలకు, భావాలకు రూపాన్ని ఇస్తూ డ్రాయింగ్ పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. సమ్మర్ క్యాంపులు ఏర్పాటు చేయడం వల్ల గ్రామంలోని విద్యార్థులతో పాటు పరిసర గ్రామాల విద్యార్థులు, పలు పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుతున్నారని పేర్కొన్నారు. నీతి కథలు విద్యార్థుల నైతిక ప్రవర్తనకు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. మంచి నడవడిక, క్రమశిక్షణ, పుస్తక పఠనం వంటి మంచి అలవాట్లు అలవడతాయని చెప్పారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి పర్యవేక్షణలో విద్యార్థులకు నీతి కథలు, పేదరాశి పెద్దమ్మ కథలు వినిపించారు. విద్యార్థులను పాఠకులు అభినందించారు.

రేపు హనుమాన్ చాలీసా మహాపారాయణం

విజయవాడకల్చరల్: జయహో భారతీయం ఆధ్వర్యంలో హనుమత్ జయంతి సందర్భంగా శనివారం హనుమాన్ చాలీసా మహాపారాయణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో సాయంత్రం 5 గంటలకు మహా పారాయణం జరుగుతుందని, భువనేశ్వరీ పీఠాధిపతి కమలానంద భారతి, ఆధ్యాత్మికవేత్త ఎంఎస్ శ్రీనివాసరావులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. లక్ష నాగవల్లి పత్రాలతో హనుమత్ ఆరాధన జరుగుతుందని పేర్కొన్నారు.

రేపు చినకంచిలో హనుమజ్జయంతి

నున్న(విజయవాడరూరల్): శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతిస్వామి దేవస్థానములు చినకంచిలో శనివారం హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ట్రస్టీ మొక్కపాటి శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

బంగారు గొలుసు చోరీ

ఉంగుటూరు: ఒంటరిగా ఉన్న వృద్ధురాలి బంగారు గొలుసు చోరీకి గురైన సంఘటన ఉంగుటూరులో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉంగుటూరు సచివాలయం సమీపంలో సంబంగి కృష్ణవేణి అనే వృద్ధురాలు ఒంటరిగా నివాసం ఉంటుంది. సుమారు 7 కాసుల బంగారు గొలుసును వృద్ధురాలు తన మంచం పరుపు కింద పెట్టుకుంది. గురువారం మధ్యాహ్నం గుడివాడలోని తన కుమారుడి ఇంటికి వెళ్లేందుకు బయలుదేరింది. ఈ క్రమంలో గొలుసు వేసుకుందామని చూస్తే కనిపించలేదు. దీంతో ఆమె ఉంగుటూరు పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రవిచంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో నమూనాలను సేకరించారు.

ఎంపీడీఓ కార్యాలయ అటెండర్ లక్ష్మి మృతి



విజయవాడరూరల్: విజయవాడరూరల్ మండల పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న ఈర్ల లక్ష్మి(36) బుధవారం విశాఖపట్నంలో మృతి చెందింది. విశాఖపట్నంలో లక్ష్మి అక్క ఇంటికెళ్లినట్లు కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. గత కొన్ని రోజులుగా మోకాలు నొప్పితో బాధపడుతున్న ఆమె సెలవుపెట్టి చికిత్స నిమిత్తం విశాఖపట్నం వెళ్లింది. అనుకోని విధంగా గుండె నొప్పి రావడంతో మృతి చెందినట్లు సిబ్బంది చెబుతున్నారు. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు. అటెండర్ లక్ష్మి భర్త నరేష్ మచిలీపట్నంలోని జిల్లా పరిషత్‌లో పనిచేస్తూ మృతిచెందగా కారుణ్య నియామకం కింద ఆమె విజయవాడరూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో అటెండర్‌గా ఉద్యోగంలో చేరింది.

బెదిరించి చోరీకి పాల్పడిన ముగ్గురు యువకుల అరెస్టు

పెనమలూరు: బైక్‌పై వెళుతున్న వ్యక్తిని అటకాయించి ముగ్గురు యువకులు బెదిరించి సెల్ ఫోన్ చోరీ చేసిన నిందితులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం కంకిపాడు మండలం ఈడుపుగల్లుకు చెందిన చింతా నారాయణరావు బుధవారం వేకువజామున తన బైక్‌పై విజయవాడ నుంచి ఈడుపుగల్లుకు బయలుదేరాడు. అతను గంగూరు సెంటర్ వద్దకు రాగా విజయవాడ చిట్టినగర్‌కు చెందిన కె.అశోక్(19), కుంచం అరుణ్‌కుమార్(19), మరో మైనర్ వేరే బైక్‌పై వచ్చి అటకాయించారు. నారాయణరావును బెదిరించి ఆయన వద్ద ఉన్న సెల్ ఫోన్ చోరీ చేసి పరార్ అయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు 24 గంటల్లోనే నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. అవనిగడ్డ కోర్టు నిందితులకు రిమాండ్ విధించింది.



